ఉచిత వైద్య శిబిరం



గోల్కొండ: కార్పొరేట్ ఆసుపత్రుల వారు మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. ఆదివారం డిలక్స్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటువంటి ఉచిత వైద్య శిబిరాల వల్ల వేలాది మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జునైది, మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ ముస్తఫా తదితరులున్నారు.

విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

గౌలిపురా: లాల్‌దర్వాజా బాలాగంజ్ ప్లే గ్రౌండ్‌లో ఆదివారం బాలాగంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్గర్ అఖాడ ఫిట్‌నెస్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60 మంది పాల్గొనగా..పూజిత, విరాట్ సింగ్‌లు విజేతలుగా నిలిచారు. విజేతకు రూ.5 వేల క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బల్వీర్ సింగ్, ప్రణీత్, రాజ్ కుమార్, మధు, సాయి ప్రభు, సాయినాథ్, రాజ్ కిరణ్, కుశాల్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తాలోని ఆంజనేయ స్వామి, వేంకటేశ్వర స్వామి, శివపార్వతి, రాధాకృష్ణ ఆలయ 18వ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకిషన్ బధ్రుక, ఏ.బాలకిషన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సుదర్శన నరసింహ హోమం, మధ్యాహ్నం 12 గంటలకు లోక కల్యాణం కోసం శాంతి కల్యాణం జరిగాయి. సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు.

ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రధాన కార్యదర్శిగా గురునాథ్ రెడ్డి



గురునాథ్ రెడ్డిని సన్మానిస్తున్న మధుసూదన్ గౌడ్

చాంద్రాయణగుట్ట: ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ ప్రతినిధి జి.గురునాథ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ..ఈ ఏడాది ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అధికారులు ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే..



శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. డివిజన్‌లోని ఖాజీపుర, షక్కర్‌గంజ్, ఘాజీబండ, శివ శంకర్ మైదాన్ తదితర ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రతిరోజు చెత్తను తొలగించాల్సిన కార్మికులు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అపరిశుభ్రంగా కారణంగా తాము ఎలాంటి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బస్తీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- మురుగు నాలాలుగా మారిన కోట కందకాలు
- ఒకొక్కటిగా కబ్జాకు గురవుతున్న వైనం
- పేరుకుపోతున్న వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: గోల్కొండ కోటను శత్రు దుర్భేద్యంగా మార్చిన కోట కందకాలు నేడు మురుగు నాలాలుగా మారాయి. దక్షిణ భారతదేశంలోనే అత్యంత పటిష్టమైన కోటలలో గోల్కొండ కోట ఒకటి. కోటకు లోతైన కందకాలు ప్రత్యేక రక్షణ కవచాలుగా ఉండేవి. ఈ కందకాల్లో కుతుబ్‌షాహీ రాజులు మొసళ్లు, విష సర్పాలు వేసి పెంచేవారు. శత్రు సైనికులు కందకాన్ని దాటి కోట ప్రహరీని తాకలేని విధంగా పటిష్టంగా తయారు చేశారు. అయితే ఈ కందకాలు నిర్వహణ లోపం వల్ల అధ్వానంగా తయారయ్యాయి. గోల్కొండ కోట ప్రహరీ చుట్టూ ఉన్న ఈ కందకాల్లో పలు ప్రాంతాల్లో భవనాలు వెలిశాయి. ఎండిఫైస్ దర్గా, మోరాయిన్ బేకరీ ఎదురుగా ఉన్న కందకం, బంజారి దర్వాజ ఎగువ భాగంలో ఉన్న కందకం కబ్జాకు గురై అక్కడ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ప్రస్తుతం గోల్కొండ కోట కేంద్ర పురావస్తు సర్వేక్షణ శాఖ అధీనంలో ఉంది. కోటకు సీనియర్ పరిరక్షణ అధికారితో పాటు సిబ్బంది ఉంది. అయితే కందకాలు కబ్జా అవుతున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్లు ఊరుకుంటున్నారు. మరో వైపు కందకాల్లో పలు ప్రాంతాల్లో మురుగు నీరు వచ్చి చేరుతోంది. మోతీదర్వాజా కందకం పెద్ద మురుగు నాలాగా మారింది. మోతీదర్వాజా నుంచి రాకపోకలు సాగించే వారు కందకం నుంచి వస్తున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు.

కందకాల్లో వ్యర్థాల డంపింగ్..

నయాకీలా, మోతీదర్వాజా, బంజారి దర్వాజా తదితర ప్రాంతాల్లోని కందకాల్లో వ్యర్థాల డంపింగ్ జోరుగా సాగుతోంది. ఆటో ట్రాలీలు, డీసీఎంలలో రాత్రి సమయంలో కందకాల్లో వ్యర్థాలు డంపింగ్ చేస్తున్నారు. కోట అధికారులు మాత్రం కందకాలకు ఫెన్సింగ్ వేసి తమ పని అయిందనిపించుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఈ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. నయాకీలాలో కందకంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జోరుగా చెత్త డంపింగ్ అవుతుంది. మరో వైపు బంజారి దర్వాజా వెనుక వైపు ఉన్న కందకాలు కూడా కబ్జా కోరల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు కోట అధికారులు కందకాలను శుభ్రం చేసిన దాఖలాలు లేనే లేవు. ఇదిలా ఉండగా కందకాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు కూడా కందకాలను కనుమరుగు చేస్తున్నాయి. ఎంతో లోతైన ఈ కందకాలు పరిస్థితి ఇలా ఉంటే పూర్తిగా కనుమరుగు కావడం ఖాయం.



గోల్కొండ మోతీదర్వాజ కందకం దుస్థితి



చారిత్రక సంపద కనుమరుగు..

అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమూల్యమైన చారిత్రక సంపద కనుమరుగవు అవుతోంది. అధికారులు చారిత్రక ప్రదేశాలు, కట్టడాల పరిరక్షణను గాలికి వదిలి తమ సత్‌ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారు. అధికారులు తమ ధోరణి మార్చుకోవాలి. – మధుసూదన్, కార్వాన్

'సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు విఫలం'



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే రాజాసింగ్, నియోజకవర్గ కార్పొరేటర్లు విఫలమయ్యారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..వర్షాకాలం ప్రారంభమైనా నియోజకవర్గంలో నాలాల పూడికతీత పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలో నాలాల పూడికతీత పనులు ప్రారంభించి మే నెలలో పూర్తవుతాయన్నారు. పూడికతీత పనులు ఇంకా ప్రారంభం కాకపోతే ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ కార్పొరేటర్లు అందరూ ఏమి పనులు చేస్తున్నారని ప్రశ్నించారు. ఒక గంట సేపు వర్షం వస్తే గోషామహల్ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధమై అల్లకల్లోలంగా మారుతుందన్నారు. పలు చౌరస్తాల్లో వర్షపు నీరు నిలిచి పోతుందన్నారు. ఉస్మాన్‌గంజ్, మహారాజ్ గంజ్ ప్రాంతంలో వర్షం అధికంగా వచ్చినప్పుడల్లా నాలాలు పొంగి ఇళ్లల్లోకి, దుకాణాల్లోకి వర్షం ప్రవహిస్తున్నా ఎమ్మెల్యే రాజాసింగ్ కానీ, బీజేపీ కార్పొరేటర్లకు కానీ చీమ కుట్టినట్లు లేదన్నారు. గత బీఆర్ఎస్ హయంలో మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌ల ఆధ్వర్యంలో పూడికతీత పనులపై సమీక్షా సమావేశాలు నిర్వహించి వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయించే వారన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ నియోజకవర్గంలో పది రోజులు ఉంటే దేశంలోని పలు ప్రాంతాల్లో మిగతా 20 రోజులు కాలం గడిపితే నియోజకవర్గ సమస్యలను ఎవరు పరిష్కరిస్తారని ఆనంద్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. వర్షాకాలంలో భారీ వర్షాలతో నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆస్తినష్టాలు, ఇతర నష్టాలు జరిగితే ఎమ్మెల్యే రాజాసింగ్, ఇతర కార్పొరేటర్లే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముగిసిన రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పుష్పయాగం చేస్తున్న శ్రీనివాస రంగనాథ భట్టాచార్యులు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు నేటితో పరి సమాప్తి అయ్యాయి. ఆదివారం బ్రహ్మోత్సవాల చివరి రోజున శ్రీదేవి భూదేవి రంగనాథ స్వామికి ఉదయం ద్వాదశ ఆరాధనలో 12 సార్లు ఆరాధనలు, 12 రకాల ప్రసాదాల ఆరగింపు, 12 రకాల మహా హారతుల అనంతరం ఉత్సవ మూర్తులకు పుష్పయాగం, రక రకాల పువ్వులతో దేవేరులకు మహా అభిషేకం చేశారు. 1008 కళశాల జలంతో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి మూల విరాట్‌కు మహా అభిషేకం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణతో బ్రహ్మోత్సవాలు పరి సమాప్తి అయ్యాయి. చివరి రోజు కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు.

ముగిసిన బాల సంస్కార శిబిరం



బాల సంస్కార శిబిరంలో బాలల ప్రదర్శన

జియాగూడ: శిబిరంలో నెల రోజుల పాటు నేర్చుకున్న సంస్కార సాధనలు భవిష్యత్‌లో బాట వేస్తాయని విశ్రాంత లెక్చరర్ రాపూరి సుమతి శివ ప్రసాద, వెంకట్రావునగర్ శిశు మందిర్ ప్రధాన చార్యులు తాంగేళ్లపల్లి రమేష్, జీఎస్ఐ గెజిటెడ్ ఆఫీసర్ ముల్లె రాకేష్ అన్నారు. కార్వాన్‌లోని క్రాంతి భవన్‌లో గత నెల రోజుల నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవా భారతి ద్వారా శివ శంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షుడు పడాల అనంత కృష్ణ ఆధ్వర్యంలో బాల సంస్కార సాధన శిబిరం (సమ్మర్ క్యాంప్) నిర్వహించడం జరిగింది. ఇందులో బాలలకు రోజు వారి ఆచారాలు, పద్ధతులు, విలువలు, భక్తి పారాయణం, దేశభక్తి, వేదాలు, శ్లోకాలు, హనుమాన్ చాలీసా, భక్తి గీతాలు, నృత్య ప్రదర్శన, ఆటలు తదితరవి నేర్పించడం జరిగింది. ఆదివారం ముగింపు వేడుకలను పురస్కరించుకొని ముఖ్య అతిథులుగా హాజరైన వారిని సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శ్యామ్ లింగం, శ్రీకాంత్, మణికంఠ, వినిత్, గోపి, పవన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటాం'



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: తెలంగాణ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉంటామని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఆదివారం టీఎన్జీఓస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..త్రిమెన్ కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌ను కలిసి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎవరినీ తొలగించొద్దని డిమాండ్ చేస్తామన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి, చీఫ్ సెక్రెటరి రామకృష్ణారావు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జగన్నాథం, ప్రవీణ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోతే శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు మధుకర్, సమియుద్దీన్, నరేష్, నాగరాజు, నాగేష్, జగన్, అన్వర్, ఇంద్రారెడ్డి, లక్ష్మణ్, రవీందర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు



సమావేశంలో నూతన అధ్యక్షుడు రాఘవేందర్, ఆలయ కమిటీల ప్రతినిధులు

యాకుత్‌పురా: త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేసి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందు చర్యలు తీసుకుంటున్నామని భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ నూతన అధ్యక్షుడు జి.రాఘవేందర్ అన్నారు. అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఆదివారం పాతబస్తీలోని వివిధ ఆలయాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో లాల్‌దర్వాజా, ఉప్పుగూడ, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల కమిటీ అధ్యక్షులు మారుతీ యాదవ్, మధుసూదన్‌గౌడ్, జగన్‌మోహన్, పలు ఆలయ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐ ఫోన్ నకిలీ పార్ట్స్ విక్రేతల అరెస్టు

అబిడ్స్: ఐ ఫోన్‌కు సంబంధించిన నకిలీ పరికరాలు విక్రయిస్తున్న దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. అబిడ్స్ జగదీష్ మార్కెట్‌లోని మాతాజీ, ఆర్.జి.మొబైల్, రాజారామ్, న్యూ డ్రీమ్స్ సెల్‌ఫోన్ దుకాణాలపై ఆదివారం దాడులు నిర్వహించిన పోలీసులు పెద్ద ఎత్తున నకిలీ యాపిల్ ఫోన్ పరికరాలను స్వాధీనం చేసుకుని విక్రమ్‌సింగ్, సురేష్ కుమార్, మహ్మద్ సర్ఫరాజ్, నాతురామ్ చౌదరి, మహ్మద్ అర్షద్‌ను అరెస్టు చేశారు.

పాతబస్తీలో పర్యాటకుల సందడి



గుల్జార్‌హౌస్-చార్మినార్ రోడ్డులో..

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. ఈనెల 11న మిస్ వరల్డ్ 2025 పోటీదారులతో పాతబస్తీలో హెరిటేజ్ వాక్ నిర్వహించిన సందర్భంగా చార్మినార్ కట్టడం వద్ద ఆంక్షలు విధించారు. దీంతో పర్యాటకులకు చార్మినార్ వరకు అనుమతి లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. 18న గుల్జార్ హౌస్ వద్ద భారీ అగ్ని ప్రమాదం జరగడంతో కూడా ఆంక్షలు కొనసాగాయి. అయితే ఈ ఆదివారం ఎలాంటి పరిస్థితులు ఎదురుకాకపోవడంతో సందర్శకులు చార్మినార్ వద్ద సందడి చేశారు. కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి సరదాగా గడిపారు.

సేవ చేసే వారికి సమాజంలో గుర్తింపు



గోల్కొండ: సేవ చేసే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని పీస్ ఫోర్స్ సొసైటీ అంబాసిటర్ మహ్మద్ నజీబ్ అన్నారు. శనివారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని సొసైటీ కార్యాలయంలో పలువురు సమాజ సేవ చేసే వారిని ఆయన సన్మానించారు. ఆయన మాట్లాడుతూ..వ్యాపారంలో అడుగుపెట్టిన యువకులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. దారిద్రరేఖకు దిగువన ఎన్నో కుటుంబాలు ఉన్నాయని వారి పిల్లలు కనీసం ప్రాథమిక పాఠశాలలకు సైతం వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. 15 ఏళ్లుగా పీస్ ఫోర్స్ సొసైటీ తరఫున అటువంటి పిల్లలకు స్కూల్స్‌లో చేరి్పంచి ఉచిత విద్య అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తౌఫిక్ ఆలీ, మహ్మద్ జాహేద్, మహ్మద్ పహాద్ తదితరులున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



టోలిచౌకీ వద్ద మానవహారంలో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకునే వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా హకీంపేట్ లిమ్రా చౌరస్తా నుంచి నానల్‌నగర్ మోరాయిన్ బేకరీ వరకు వేలాది మందితో కూడిన మానవహారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రధానిగా ఎన్నికైన నాటి నుంచి ముస్లింలపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో మెహిదీపట్నం చౌరస్తా వద్ద ఆల్ పార్టీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, సయ్యబ్‌భాయి, రహీముల్లాఖాన్ నియాజీ తదితరులున్నారు.

ఉత్తమ సమాజానికి బాల సాహిత్యం ఎంతో అవసరం



బాల సాహితీవేత్తలను సత్కరిస్తున్న డాక్టర్ వరప్రసాదరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: ఉత్తమ సమాజానికి బాల సాహిత్యం ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. శాంత వసంత ట్రస్ట్ సౌజన్యంతో తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం నిర్వహించిన కోడూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనం సందడిగా సాగింది. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన సాగిన సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది ప్రతినిధులు, 65 మంది వక్తలు పాల్గొన్నారు. శాంతా వసంత ట్రస్ట్ అధినేత పద్మభూషణ్, డాక్టర్ కేఐ.వరప్రసాదరెడ్డి బాల సాహిత్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న రెండు రాష్ట్రాలకు చెందిన బాల సాహితీవేత్తలు, ఉపాధ్యాయులను సత్కరించి రూ.2500 నగదు, శాలువా, జ్ఞాపికతో గౌరవించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపాన్యాసం చేశారు. బాల సాహితీవేత్తలు గరిపల్లి అశోక్, మోహన్, డాక్టర్ విఆర్.శర్మ, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకటరమణ, నీరజ, చంద్రశేఖర్ ఆజాద్, చదువుల బాబు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు


సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఫ్రీ బస్సుతో ఆటో డ్రైవర్ల జీవనోపాధికి కరువైందని తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు అప్పులు తెచ్చి ఫైనాన్స్‌లో ఆటో కొనుకొన్ని బతుకుతున్నామని, ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పెట్టడంతో తమ జీవనోపాధి కరువైందన్నారు. తమ సమస్యలపై తెలంగాణ రాష్ట్రంలో నాన్‌పొలిటికల్ జేఏసీగా ఏర్పడి ఆటోడ్రైవర్ల సమస్యలపై పోరాడుతున్నామన్నారు. ఏప్రిల్ 25న మెదక్ జిల్లా నుంచి 33 రోజుల పాటు తెలంగాణలో 100 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆటో పాదయాత్ర ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 27న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఆటో ఆకలి కేకలు పేరిట మహా సభ నిర్వహిస్తున్నామని, దానికి అన్ని ఆటో సంఘాల నాయకులు అతిథులుగా రానున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్లు ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేముల మారయ్య, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కూచిపూడి నృత్య కళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం ముగింపు ఉత్సవాలను ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య గురువు శ్రావ్య మానస ఆధ్వర్యంలో నీలమేఘశ్యామ పేరిట నిర్వహించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ భగవానుడి నీలామృతంలోని కొన్ని ఘట్టాలను విద్యార్థులు చక్కటి హావాభావాలతో ప్రదర్శించిన తీరు మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు మాట్లాడుతూ..చిన్నప్పటి నుంచే శాస్త్రీయ సంగీత కళల్లో చిన్నారులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, సినీ నటుడు బోగిరెడ్డి శ్రీనివాస్, రవికుమార్ దూళిపాల తదితరులు పాల్గొన్నారు.

గుల్జార్ హౌస్ మృతులకు నివాళి



సంతాప సభలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

చార్మినార్: గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన వారికి సికింద్రాబాద్ హైదరాబాద్ నార్నూల్ అగర్వాల్ కమిటీ ప్రతినిధులు నివాళులర్పించారు. ఆదివారం రాత్రి ఘాన్సీ బజార్‌లో నిర్వహించిన సంతాప సభలో పలువురు అధికార అనధికార ప్రముఖులు పాల్గొని వృద్ధులకు శ్రద్ధాంజలి ఘటించి మృతుల కుటుంబాలకు తమ సంతాపం తెలిపారు. కమిటీ అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంతాప సభలో మోదీ కుటుంబసభ్యుడు భరత్‌లాల్ మోదీ, 17 మంది గురించి క్లుప్తంగా సమాచారం ఇచ్చి నివాళులర్పించారు. ఉదాస్ అఖారాకు చెందిన మహంత్ శ్రీ అరుణ్ దాస్ జీ మహారాజ్, బీజేపీ నాయకురాలు మేఘారాణి అగర్వాల్ మాట్లాడుతూ..ఈ ఘటన జరిగిన సమయంలో తెలంగాణ ప్రభుత్వ అత్యవసర సేవలు పూర్తిగా నిరుపయోగమయ్యాయన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి తరుణ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు రాజేష్ అగర్వాల్, సరితా అగర్వాల్, అనూప్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.